# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 14-10-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ ఆఫ్రికా దేశాలతో స్నేహపూర్వక సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి భారత్ కట్టుబడి ఉందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.

- ❖ వరల్డ్ టెలికమ్యూనికేషన్ స్టాండర్డైజేషన్ అసెంబ్లీను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు భారత మండపంలో ప్రారంభించనున్నారు.

- ❖ దేశంలోని 80 శాతం ప్రజలకు 5జీ టెలికాం సేవలను అందుబాటులోకి తెచ్చామని కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు.

- ❖ అర్థశాస్త్రంలో ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారాన్ని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్-2024 సంవత్సరానికి గాను ముగ్గురికి ప్రకటించింది.

- ❖ దేశ వ్యాప్తంగా 400 ఇథనాల్ బయో ఫ్యూయల్ పంపులను ఏర్పాటు చేస్తున్నామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలియజేశారు.

=======================

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విదేశీ పర్యటనలో భాగంగా ఈరోజు అల్జీరియా రాజధాని అల్జీర్స్ లో పలు ద్వైపాక్షిక సమావేశాలను నిర్వహించారు. అల్జీరియా స్వాతంత్ర్య సమరయోధుల స్మారకార్థం నిర్మించిన అమరవీరుల స్మారకం మకామ్ ఎచాహిద్‌ను ఈరోజు రాష్ట్రపతి సందర్శించారు. అనంతరం అల్జీరియా - ఇండియా ఎకనామిక్ ఫోరమ్‌లో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆఫ్రికాలోని దేశాలతో ఇప్పటికే ఉన్న స్నేహపూర్వక సంబంధాలను మరింత బలోపేతం చేయడానికి భారతదేశ నిబద్ధతను ద్రౌపది ముర్ము తెలియజేస్తూ...

(వాయిస్ 34 సెకన్లు)

=======================

వరల్డ్ టెలికమ్యూనికేషన్ స్టాండర్డైజేషన్ అసెంబ్లీ (WTSA) రేపు న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరగనుంది. ఈ కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. పది రోజుల పాటూ జరగనున్న ఈ కార్యక్రమం 6G, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, బిగ్ డేటా, సైబర్‌సెక్యూరిటీ, మెషిన్-టు-మెషిన్ కమ్యూనికేషన్స్, క్వాంటం టెక్నాలజీల వంటి రంగాలలో సాంకేతిక ప్రమాణాల భవిష్యత్తును రూపొందించడం లక్ష్యంగా పెట్టుకుంది. 190 దేశాలకు చెందిన మూడు వేల మంది ప్రపంచ నాయకులు, సాంకేతిక నిపుణులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ఇది ప్రపంచ టెలికమ్యూనికేషన్ ప్రమాణాలను ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది .ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒకసారి టెలికమ్యూనికేషన్ అసెంబ్లీని నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి భారత్  ఆతిథ్యం ఇవ్వడం ఇదే తొలిసారి. ఇండియా మొబైల్ కాంగ్రెస్‌ను కూడా నరేంద్ర మోదీ రేపు  ప్రారంభించనున్నారు.

=======================

దేశంలోని 80 శాతం ప్రజలకు 5జీ టెలికాం సేవలను కేవలం 22 నెలల్లోనే అందుబాటులోకి తెచ్చామని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా పేర్కొన్నారు. న్యూ ఢిల్లీలో ఈరోజు జరిగిన 5వ గ్లోబల్ స్టాండర్డ్స్ సింపోజియం ప్రారంభ సమావేశంలో ఆయన ప్రసంగించారు. సాంకేతికత, ఆవిష్కరణల్లో ప్రపంచం పెనుమార్పును చూస్తోందని, అందువల్ల ప్రమాణాలు నిబంధనల భావన మరింత ప్రాముఖ్యత సంతరించుకుందని జ్యోతిరాదిత్య సింధియా అన్నారు. భారత్ లో 2040 నాటికి 450 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నామని ఆయన మాట్లాడుతూ....

(వాయిస్ 34 సెకన్లు)

=======================

అర్థశాస్త్రంలో ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారాన్ని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ 2024 సంవత్సరానికి గాను ముగ్గురికి ప్రకటించింది. దేశాల మధ్య సంపదలో అసమానతలపై చేసిన పరిశోధనలకుగానూ డారెన్ ఏస్‌మోగ్లు, సైమన్ జాన్సన్, జేమ్స్ ఎ. రాబిన్‌సన్ ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు.

విరామం

=======================

దేశ వ్యాప్తంగా 400 ఇథనాల్ బయో ఫ్యూయల్ పంపులను ఏర్పాటు చేస్తున్నామని కేంద్ర రోడ్డు, రవాణా, రహదారుల శాఖా మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఈరోజు న్యూఢిల్లీలో భారత పరిశ్రమల సమాఖ్య (CII) నిర్వహించిన బయోఎనర్జీ సమ్మిట్-2024లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 3 వేర్వేరు ఆటోమొబైల్ కంపెనీల ద్వారా ఫ్లెక్స్-ఇంజిన్ వాహనాలను ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తుందని తెలిపారు. దేశంలో జీవఇంధనం ఆర్థికంగా లాభదాయకమని CNG, ఇథనాల్, మీథేన్ వంటి జీవ ఇంధనాలుగా మార్చడానికి వ్యర్థాలను వేరుచేయవలసిన అవసరాన్ని నితిన్ గడ్కరీ ప్రస్తావిస్తూ....

(వాయిస్ 34 సెకన్లు)

=======================

మహారాష్ట్ర ప్రభుత్వం టోల్ ఫీజు వసూలుకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. ముంబయికి వెళ్లే మార్గంలోని మొత్తం 5 టోల్ ప్లాజాల వద్ద లైట్ మోటార్ వాహనాలకు టోల్ ఫీజును పూర్తిగా రద్దు చేస్తున్నామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండే ప్రకటించారు. ఈ అర్థరాత్రి నుంచి ఈ టోల్ మినహాయింపు అమలులోకి వస్తుందని

ఈరోజు  జరిగిన మంత్రి వర్గ సమావేశంలో తెలిపారు. దీంతో ఇకపై దహీసర్, ములుండ్, వైశాలి, ఐరోలి, ఆనంద్ నగర్ టోల్ ప్లాజాలో లైట్ మోటార్ వాహనాదారులు ఎలాంటి రుసుములు చెల్లించాల్సిన అవసరం ఉండదని మంత్రి దాదాజీ దగదు భూసే అన్నారు.

========================

భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్ జైశంకర్ ఈరోజు న్యూఢిల్లీలో ఈ-మైగ్రేట్ వెర్షన్ 2.0 వెబ్ పోర్టల్, మొబైల్ యాప్‌ను ప్రారంభించారు. ఈ-మైగ్రేట్ పోర్టల్‌లో 2.81 లక్షల మంది విదేశీ ఉద్యోగులు రిజిస్టర్ అయి ఉన్నారని.. ఈ పోర్టల్ వలసదారులకు సామాజిక భద్రతను కల్పించడంతో పాటూ సురక్షితమైన సమ్మిళిత చైతన్యాన్ని సృష్టించేందుకు ప్రారంభించామని ఆయన వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా సుశిక్షితులైన శ్రామికశక్తి అవసరం పెరుగుతుందని జైశంకర్ పేర్కొంటూ....

(వాయిస్ 26 సెకన్లు)

========================

కేంద్ర పాలిత ప్రాంతం జమ్మూకశ్మీర్‌లో రాష్ట్రపతి పాలనను రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్-కాంగ్రెస్ కూటమి విజయం సాధించింది. కాగా అంతకుముందు, నేషనల్ కాన్ఫరెన్స్ వైస్ ప్రెసిడెంట్ ఒమర్ అబ్దుల్లా శ్రీనగర్‌లోని రాజ్ భవన్ లో లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాతో సమావేశమయ్యారు.

========================

ఇంటర్నేషనల్ షూటింగ్ స్పోర్ట్ ఫెడరేషన్ జూనియర్ వరల్డ్ కప్‌కు వచ్చే సంవత్సరం భారత్ ఆతిథ్యం ఇవ్వనుందని ISSF ప్రెసిడెంట్ లూసియానో రోస్సీ తెలిపారు. నిన్న న్యూఢిల్లీలో ISSF వరల్డ్ కప్ ఫైనల్ కు ముందు ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ... ప్రపంచ వ్యాప్తంగా షూటింగ్ కు పెరుగుతున్న ప్రజాదరణకు భారతదేశం సహకారాన్ని ప్రశంసించారు. భారత్ తన ప్రతిభావంతులైన అథ్లెట్లకు మౌలిక సదుపాయాలను విస్తరించడంతో షూటింగ్ ప్రపంచంలో ఒక ముఖ్యమైన శక్తిగా కొనసాగుతోందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు కాళికేష్ నారాయణ్ సింగ్ డియో పాల్గొన్నారు.

========================

దేశ రాజధాని ఢిల్లీలో పెరుగుతున్న కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఢిల్లీ ప్రభుత్వం ఈరోజు అన్ని రకాల బాణాసంచా తయారీ, నిల్వ, అమ్మకాలపై నిషేధం విధించింది. ఈ నిషేధం ఈ రోజు నుంచి వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ వరకు అమలులో ఉంటుంది. ఆన్‌లైన్ మార్కెటింగ్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా డెలివరీ చేయడం, బాణసంచా పేల్చడంపై కూడా నిషేధాన్ని విధించామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు ఢిల్లీ కాలుష్య నియంత్రణ కమిటీ ఈ విషయంలో ఉత్తర్వులు జారీ చేసింది.

========================
========================